# బీమాతోనే జీవితానికి ధీమా



మృతుని భార్యకు బీమా చెక్కును అందజేస్తున్న మేనేజర్ చంద్రశేఖర్

కరకగూడెం: బీమాతోనే జీవితానికి ధీమా అని కరకగూడెం ఏపీజీవీబీ బ్యాంక్ మేనేజర్ చంద్రశేఖర్ అన్నారు. పద్మాపురం గ్రామానికి చెందిన పోగు రమేష్ గత కొద్ది నెలల క్రితం ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. అతను ఏపీజీవీబీ బ్యాంకులో ఖాతా కలిగి ఉండడంతోపాటు అతనికి అందించిన రూపే ఏటీఎం కార్డు ద్వారా బ్యాంకు లావాదేవీలను సక్రమంగా వినియోగించుకున్నాడు. ఈ క్రమంలో అతను అకాల మరణం చెందడంతో రూ.లక్ష ప్రమాద బీమా వర్తించింది. ఈ సందర్భంగా గురువారం కరకగూడెం బ్యాంకులో బ్యాంకు అధికారులు మృతిని నామిని అయిన అతని భార్య భాగ్యకు ఆ బీమా లక్ష రూపాయల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ... మృతుడు రమేష్ రూపే కార్డును వినియోగించుకోవడం ద్వారా అతనికి రూ.లక్ష ప్రమాద బీమా వర్తించిందని కావున ప్రతి ఖాతాదారుడు బీమా పథకాల విషయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అలాగే 'ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన' పథకంలో భాగంగా బ్యాంకు నందు ఏడాదికి రూ.330 చెల్లిస్తే రూ.2 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందని చెప్పారు. అంతేకాకుండా బ్యాంకు సేవలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కార్యక్రమంలో క్యాషియర్ జగదీష్, బ్యాంకు మిత్రలు రమాదేవి, వెంకన్న, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.